క్లుప్తంగా

గ్రామాలకు బతుకమ్మ చీరలు

రాజోళి: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న బతుకమ్మ చీరలు ఆయా గ్రామాలకు చేరాయి. మండలంలోని ఆయా గ్రామాలకు సంబంధించిన 8,790 చీరలు మండల కేంద్రానికి మంగళవారం వచ్చాయి. వాటిని గ్రామాల వారీగా గ్రామపంచాయతీలకు పంపినట్లు ఎంపీడీఓ గోవిందురావు తెలిపారు.

నేడు చీరల పంపిణీ

ధరూరు: మండల కేంద్రంలోని రైతు వేదికలో బతుకమ్మ చీరల పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ ఎండీ జబ్బార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్క మహిళ తమ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ తీసుకుని పంపిణీ కేంద్రానికి రావాలని సూచించారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరవుతున్నారు.

మధ్యంతర భృతిని ప్రకటించడం శోచనీయం

అలంపూర్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన డీఏలు వెంటనే ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయుల సంఘం సభ్యులు అలంపూర్ చౌరస్తాలోని సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఉపాధ్యాయులందరికి రాష్ట్ర ప్రభుత్వం సముచిత న్యాయం చేస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ కేవలం 5శాతం మధ్యంతర భృతిని ప్రకటించడం శోచనీయమని, కనీసం 20 శాతం మధ్యంతర భృతిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌రెడ్డి, జిలా ఉపాధ్యక్షుడు మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహాధర్నాకు తరలిన ఉద్యమకారులు

గద్వాల అర్బన్: హైదరాబాద్‌లో మంగళవారం చేపట్టిన 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం మహాధర్నాకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ముందుగా జిల్లా కేంద్రంలోని కొట్టం వేణుగోపాల్ పార్కు వద్ద తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో 1969తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉపాధ్యక్షుడు మోహన్‌రావు, వెంకట్రామిరెడ్డి, దౌలన్న, శ్రీనివాసులు, భీసన్న ఉన్నారు.

'నివాసగృహాలకు అడ్డుపడను'

మానవపాడు: 2009 వరద బాధితుల నివాస గృహాలను మద్దూర్ ప్రజలకు అందించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించానని, నివాస గృహాలు రాకుండా అడ్డుపడనని ఎంపీపీ అశోక్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తప్పుడు ఆరోపణలు చేస్తే తనపై సుమోటో కేసు వేయాలని ఆయన తెలిపారు. అసత్య ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నిషేధిత వలల వినియోగంపై కేసు

ధరూరు: ప్రభుత్వం నిషేధించిన అలివి వలలతో చిన్నపాటి చేపలు పడుతున్న ఆంధ్రా ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ధరూరు పోలీసులు తెలిపారు. మండలంలోని ఖమ్మంపాడు శివారులోని కృష్ణానది తీరంలో నిషేధిత అలివి వలలను ఉపయోగించి ఆంధ్రా ప్రాంతానికి చెందిన గొల్లయ్య, మల్లయ్య, శ్రీనివాసులు చేపలు పడుతున్నారు. మంగళవారం జిల్లా మత్స్య శాఖ అధికారిణి షకీలాభాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వెంకట్రాములు తెలిపారు.

వాల్‌పోస్టర్ విడుదల

అలంపూర్: మాదిగల విశ్వరూప మహాపాద యాత్ర వాల్‌పోస్టర్ ను మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు అలంపూర్ పట్టణంలో విడుదల చేశారు. ఈనెల 7వ తేదీన అలంపూర్ నుంచి హైదరాబాద్ వరకు సాగే యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. మందకృష్ణ మాదిగ ఈ నెల 7న అలంపూర్‌లో జోగుళాంబ దేవిని దర్శించుకుని యాత్రను ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలోఎంఎస్పీ జిల్లా కన్వీనర్ అలంపూర్ మండల ఇన్‌చార్జ్ రాజు, జాను, మద్దిలేటి, మస్తాన్, భీమన్న, ఎలీషా, ఆదాం పాల్గొన్నారు.

వేధింపులపై కేసు నమోదు

గద్వాల క్రైం: చిత్ర హింసలకు గురి చేస్తూ మానసికంగా వేధిస్తున్న అత్తింటివారిపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధితురాలు శ్వేత, పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని వేణుకాలనీకి చెందిన బీఎస్ విజయ్‌కుమార్‌తో శ్వేతకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. అనంతరం ఆమె గర్భం దాల్చగా భర్త ఇప్పుడే పిల్లలు వద్దని శరీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేశాడు. ఈ క్రమంలో రెండు సార్లు గర్భంలోనే పిల్లలు మృతి చెందారు. భార్యాభర్తలిద్దరు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోగా భర్తకు హార్మోన్స్ లోపం ఉందని చెప్పారు. ఈ విషయం దాచి భార్యకే లోపం ఉందని అత్తింటివారు నమ్మించారు. ఇటీవల ఆమె మరోసారి గర్భం దాల్చింది. దీంతో భర్త కుటుంబ సభ్యులు బీఎస్ నర్సింహులు, శంకరమ్మ, లక్ష్మీదేవి, వసంత, తిమ్ములమ్మ, శోభలు పుట్టబోయే బిడ్డ ఎదుగుదల ఉండదని అబార్షన్ చేయించుకోవాలని ఆమెను వేధింపులకు గురి చేశారు. వారి నుంచి రక్షణ కల్పించి వారిపై చర్యలు తీసుకోవాలని శ్వేత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు భర్త, కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

రేషన్.. పరేషాన్!

- రేషన్ షాపుల్లో వేలిముద్ర తప్పనిసరి
- బయోమెట్రిక్ చేస్తేనే రేషన్ బియ్యం

ఉండవెల్లి: పేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రేషన్ బియ్యం తీసుకోవడానికి లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 7,871 రేషన్ కార్డుల లబ్ధిదారులు బయోమెట్రిక్ చేయడానికి ఆధార్ అనుసంధానం ఉండాలి. వేలిముద్ర నమోదుకు ఆధార్ అప్‌డేట్ చేసి ఉండాలి. అప్‌డేట్ లేని లబ్ధిదారులు ఆధార్ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. చిన్నారులు, వృద్ధులు బయోమెట్రిక్ నమోదు కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వేలిముద్ర నమోదు అయితేనే రేషన్ బియ్యం..

ఇప్పుడు వేలిముద్ర నమోదు అయితేనే వచ్చేనెల రేషన్ బియ్యం వస్తుందని డీలర్లు లబ్ధిదారులకు చెబుతున్నారు. రేషన్ దుకాణాలు అందుబాటులో ఉన్నచోట సర్వర్ ఇబ్బందులు, తంబ్ పడక, కరెంట్ లేక అంతరాయం ఏర్పడుతోంది. రేషన్ కార్డులో చిన్నారుల పేర్లు నమోదు చేసినా వారి బయోమెట్రిక్ లేకపోవడంతో దగ్గర్లో ఉన్న మానవపాడు, అలంపూర్‌లలో ఉన్న ఆధార్ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. అక్కడ సర్వర్ లేకపోతే కర్నూల్‌కు వెళ్తున్నారు.

ఈకేవైసీకి తిప్పలు..

ఆధార్‌ను అమలు చేసినప్పటి నుంచి అన్ని తిప్పలే ఉన్నాయి. ఆధార్‌కు ఫోన్ నెంబర్ లింక్ లేకున్న, ఫొటో లేకున్నా పక్క రాష్ట్రానికి పరుగులు పెడుతున్నారు. కర్నూల్‌కు వెళ్లి ఆధార్ అప్‌డేట్ చేయించుకొని రేషన్ షాపుల్లో తంబ్ నమోదు అయ్యేవరకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



చిన్న ఆముదాలపాడులో రేషన్ దుకాణంలో బయోమెట్రిక్ వేస్తున్న లబ్ధిదారులు

ఆధార్ అప్‌డేట్ కోసం కర్నూలు వెళ్లొచ్చాను..



గ్రామంలోని రేషన్‌కార్డులో ఉన్న పేర్లకు బయోమెట్రిక్ నమోదు కాకపోవడంతో కర్నూల్‌కు వెళ్లి ఆధార్ అప్‌డేట్ చేయించుకొచ్చాను. ప్రతి చిన్న తప్పిదనానికి కర్నూల్ వెళ్లాల్సి వస్తోంది. ఆధార్ సెంటర్ అందుబాటులో లేకనే పక్క మండలానికి, రాష్ట్రాలకు వెళ్లాల్సి వస్తోంది.

– శివ కుమార్, ఉండవెల్లి

ఆధార్ సెంటర్ బ్లాక్‌లో ఉంది..

స్థానికంగా ఉన్న ఆధార్ సెంటర్ బ్లాక్ చేయడంతో అందరు మానవపాడు, అలంపూర్ మండల కేంద్రాలకు వెళ్తున్నారు. అక్కడ ఆధార్ సెంటర్లలో అప్‌డేట్ చేయించుకుంటున్నారు. ఆధార్ సెంటర్ అందుబాబులో ఉంటే బయోమెట్రిక్ ఇక్కడే ఉండేది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చాం.

– జయంతి, డీటీ, ఉండవెల్లి

మహిళలకు అండగా సీఎం కేసీఆర్

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



గర్భిణులకు కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు

గద్వాల రూరల్: మహిళలకు అండగా సీఎం కేసీఆర్ నిలబడ్డారని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో 500 మంది గర్భిణులకు సీమంతం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లు, బాలింతలకు కేసీఆర్ కిట్లు అందిస్తూ, వారికి ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీల సంఖ్య పెరిగిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రమేష్‌నాయుడు, మహిళా నాయకురాలు రాధ, రాధమ్మ, అంగన్‌వాడీలు ఇందిరమ్మ పాల్గొన్నారు.

బీమా చెక్కు పంపిణీ..

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గట్టు మండలం బల్గెర గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త సునంద కుటుంబానికి పార్టీ సభ్యత్వంలో భాగంగా రూ.2లక్షల బీమా చెక్కును ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అందజేశారు. త్వరలోనే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పూర్తి చేసి డిప్ విధానంతో షాపులను కేటాయిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. పట్టణంలోని వ్యాపారస్తులతో కలిసి పట్టణ పోలీసుస్టేషన్ పక్కన నిర్మిస్తున్న నూతన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, వైస్ చైర్మన్ బాబర్, కౌన్సిలర్లు శ్రీనివాసులు, నరహరిగౌడ్, నాగిరెడ్డి, దౌలు, నరహరి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సత్తా చాటిన విద్యార్థులు

గద్వాల అర్బన్: హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్ ఓపెన్ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా కేంద్రంలోని మదర్స్ ల్యాబ్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. కుమితి విభాగంలో యహియా అలీఖాన్, మహ్మద్ ఆఫ్నన్, కటాస్ విభాగంలో అఫ్రీన్, అయేషాలు గోల్డ్ మెడల్స్ సాధించారు. ఉమర్, సైఫ్, షోయబ్‌లు సిల్వర్ మెడల్స్‌ను కైవసం చేసుకోగా, సాద్, రహమాన్ జెఫ్ బ్రాజ్ మెడల్స్‌ను సాధించారు. వారిని మంగళవారం పాఠశాల ప్రిన్సిపాల్ సాదిక్, మాస్టర్ ఇలియాస్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు



మానవపాడు: మండలంలోని మద్దూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి విధులు సక్రమంగా నిర్వహించడంలేదని గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి, గ్రామస్తులు మంగళవారం ఎంపీడీఓ రమణరావుకు, తహసీల్దార్ జుబెర్ మొహిసిద్దీన్‌కు ఫిర్యాదు చేశారు. మూడు నెలల క్రితం పంచాయతీ కార్యదర్శిగా నరేందర్‌రెడ్డిని నియమించారని, అప్పటికే విధుల్లో ఉన్న శ్రీధర్‌రెడ్డిని విధుల నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కమిటీకి తెలపకుండా ఇష్టానుసారంగా పనిచేస్తున్న నరేందర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వలీ, వార్డునెంబర్లు ఈరమ్మ, సుంకన్న, భారతి, నాగమణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యలు తీరేదాక పోరాడతాం



మల్దకల్‌లో మాట్లాడుతున్న సునీత



ధరూరులో సమ్మెలో పాల్గొన్న ఆశా కార్యకర్తలు

అలంపూర్: ఆశా కార్యకర్తలు తమ సమస్యలు తీరేదాక పోరాడతామని, సమ్మెలో భాగంగా నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన వారు ఎమ్మెల్యే అబ్రహంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆశ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సీఎం దృష్టికి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు పద్మ, అమ్ములమ్మ, బీసమ్మ, సంతోషమ్మ, రేణుక, కృష్ణవేణి, నాగలచ్చమ్మ, సునీత, భారతి ఉన్నారు.

సీఐటీయూ, బీఎస్పీ మద్దతు..

ఆశా కార్యకర్తలకు సీఐటీయూ, బీఎస్పీ నాయకులు మద్దతు తెలిపారు. ఆశా కార్యకర్తల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కేశవరావు, బోరెల్లి మహేష్, సీఐటీయూ నాయకులు తిరుపాల్, మధుగౌడ్, వీరన్న, నాగజ్యోతి, ప్రభుదాస్, షాహిని, మల్లీశ్వరి, వెంకటేశ్వర్లు, ధర్మారం రాముడు పాల్గొన్నారు.

ధరూరు: ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు న్యాయం చేయాలని చేపట్టిన నిరవధిక సమ్మె 8వ రోజుకు చేరింది. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ముందు సమ్మె చేపట్టారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్దకల్: ప్రభుత్వం ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించే దాకా పోరాడతామని సునీత, కాంతమ్మ, సుజాతలు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాయంలో ఎదుట ఆశాలు సమ్మె కొనసాగించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు కేశమ్మ, కృష్ణవేణి, సుజాత, నర్సమ్మ, శంకరమ్మ, భారతమ్మ పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలి

మల్దకల్: అంగన్‌వాడీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బాలమ్మ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే తల్లీబిడ్డా ఆరోగ్యంగా ఉంటారనే విషయాన్ని వారికి తెలిపారు. కార్యక్రమమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఓటును నిజాయితీగా వినియోగించుకోవాలి

శాంతినగర్: ఓటు హక్కును నిజాయితీగా వినియోగించుకోవాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగ్లళ్ల రంజిత్‌కుమార్ అన్నారు. శాంతినగర్‌లో అలంపూర్ నియోజకవర్గ సమన్వయకర్త నాగేష్‌యాదవ్ ఆధ్వర్యంలో 'విద్య–ఓటు–విద్యార్థి' అనే అంశంపై ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు అనే ఆయుధాన్ని సక్రమంగా వాడి చిత్తశుద్ధిగల నాయకత్వాన్ని ఎన్నుకునే దిశగా యువత, విద్యార్థులు కీలకపాత్ర వహించాలన్నారు. సమావేశంలో సమన్వయకర్త గౌనింటి వీరేష్, జిల్లా కార్యదర్శి లవన్న, జిల్లా నాయకులు రంగస్వామి, బంగారు కిషోర్, వీరేష్, రవి, రాముడు, ప్రేమ్‌రాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంత గ్రంథాల అందజేత



కేటీదొడ్డి: ప్రతి ఒక్కరూ అధ్యాత్మిక విషయాలపై అవగాహన పెంచుకోవాలని త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రభోద సేవా మండల అధ్యక్షుడు కృష్ణమూర్తి, ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని భగవద్గీత ఆచార్య ప్రభోనంద యోగీశ్వరుల గ్రంథాల ప్రచార కార్యక్రమం నిర్వహించి కృష్ణుని చిత్రపటం, భగవద్గీత పుస్తకాలను అందజేసి శ్లోకాలు వాటి భావాలు వినిపించారు. కార్యక్రమంలో సభ్యులు సాయి, వీరేష్, వెంకటేష్‌నాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తాం

అలంపూర్: పట్టణంలోని అక్బర్‌పేటలో ఇబ్బందికరంగా ఉన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. అక్బర్‌పేట కాలనీవాసులు డ్రైనేజీ సమస్యపై ఇచ్చిన ఫిర్యాదు మేరక ఆమె స్పందించారు. కాలనీలో ఉన్న డ్రైనేజీ సమస్యను ఆమె సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. సమస్య పరిష్కారానికి ప్రజలు కూడా సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వెంకటేష్, నారాయణ, రామాంజనేయులు, సామేలు, కాలనీవాసులు శేఖర్ ఉన్నారు.



అక్బర్‌పేట కాలనీవాసులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మనోరమ

ధర్నాకు తరలిన కార్మికులు



గద్వాల అర్బన్: మున్సిపాలిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని హైదరాబాద్‌లో చేపట్టిన మహాధర్నాకు మంగళవారం జిల్లాలోని గద్వాల, అయిజ, అలంపూర్, వడ్డేపల్లి మున్సిపల్ కార్మికులు తరలివెళ్లారు. మున్సిపల్ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గట్టన్న, పట్టణ అధ్యక్షుడు రాజేష్ ఉన్నారు.

కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ

గద్వాల అర్బన్: తిరగబడదాం–తరిమికొడదాం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని సంగాల, జిల్లెడబండ, మర్లపల్లి గ్రామాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత పర్యటించి కాంగ్రెస్ పార్టీ జెండాలను ఆవిష్కరించారు.

జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ

మల్దకల్: మండల కేంద్రంలో విశ్వనాథం అనారోగ్యంతో మంగళవారం మృతి చెందడంతో ఈ విషయం తెలుసుకున్న జెడ్పీచైర్‌పర్సన్ సరిత బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గోవిందు, శ్రీనివాస్‌గౌడు, ఆంజనేయులు, మద్దిలేటి ఉన్నారు.

పశు వైద్యశిబిరం

కేటీదొడ్డి: పశువులకు రోగాలు రాకుండా తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని మండల పశువైద్యాధికారి వినయ్‌కుమార్ అన్నారు. మండలంలోని కుచినెర్ల గ్రామంలో మంగళవారం పశువులకు చికిత్స నిర్వహించారు.

చలో డైరెక్టరేట్ విజయవంతం చేయండి

శాంతినగర్: రాష్ట్ర స్టీరింగ్ కమిటీ పిలుపు మేరకు 142 జీఓను రద్దు చేయాలని ఈనెల 5న చేపట్టిన చలో డైరెక్టరేట్‌ను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గద్వాల జిల్లాలోని ఆయా ప్రాథమికి ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పనిచేసే అన్ని క్యాడర్ల ఉద్యోగులు చలో డైరెక్టరేట్‌కు రావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ధరూరు: గుడ్డెందొడ్డి శివారులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(అలంపూర్)లో పీజీటీ ఇంగ్లిష్ సబ్జెక్టు బోధించుటకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ 9490212966కు సంప్రదించాలని కోరారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

గట్టు: ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రయత్నించాలని డీఎం అండ్‌హెచ్‌ఓ శశికళ కోరారు. బుధవారం గట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ మేళాను నిర్వహించారు. టీబీ, షుగర్, బీపీ పేషంట్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ శశికళ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. షుగర్, బీపీతో పాటుగా టీబీకి కూడా ఆస్పత్రిలో మందులను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. హెల్త్ మేళాలో మహిళలకు న్యూట్రీషన్ కిట్లను, రోగులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌ఓ సిద్దప్ప, ప్రోగ్రామ్ అధికారి స్రవంతి, సర్పంచు ధనలక్ష్మి, ఎంపీటీసీ కృష్ణ, సీహెచ్‌ఓ ఊసేని, వైద్య సిబ్బంది, గ్రామస్తులు మహబూబ్ పాష, రమేష్ పాల్గొన్నారు.



న్యూట్రీషన్ కిట్టును అందజేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



ఈడుగోనిపల్లిలో గ్రామ పంచాయతీ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అయిజ: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తోందని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పలలో రూ.15 లక్షలతో, నౌరోజి క్యాంప్‌లో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, గ్రామంలో రూ.1.8 కోట్లతో బీటీ నిర్మాణం, చిన్న తాండ్రపాడులో రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈడుగోనిపల్లిలో రూ. 20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. దేశంలో ఏ రాష్ట్రంలో చేయని అభివృద్ధి పనులు తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేస్తున్నారని, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉన్నాయని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్‌పై అవగాహన



ధరూరు పీహెచ్‌సీలో నర్సింగ్ కళాశాల విద్యార్థినులు

ధరూరు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్‌పై అవగాహన కల్పించినట్లు ఆరోగ్య పర్యవేక్షకుడు హీర్యానాయక్ తెలిపారు. రెండో సంవత్సరం పాఠ్యాంశంలో భాగంగా మంగళవారం నుంచి 9 రోజుల పాటు గ్రామీణ ప్రాంతంలో కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్‌పై అవగాహన కల్పిస్తామని తెలిపారు. విద్యార్థులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ విభాగాలను చూపించారు. అంతకుముందు గ్రామంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గట్టు: మన చుట్టూ ఉండే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ నర్సింహులు తెలిపారు. మంగళవారం మండలంలో తుమ్మలపల్లి, మిట్టదొడ్డి, చిన్నోనిపల్లె, బోయలగూడెం, చమన్‌ఖాన్‌దొడ్డి, బల్గెర, గొర్లఖాన్‌దొడ్డి, వాయిల్‌కుంట తండా, బస్వాపురం గ్రామాల్లో పంచాయతీలకు చెత్త బుట్టలను అందజేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సునిల్‌కుమార్, అరుణ్, ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



గొర్లఖాన్‌దొడ్డిలో పంచాయతీకి చెత్తబుట్టను అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

బ్యాంకులో కిక్కిరిసిన ఖాతాదారులు



అయిజ ఎస్‌బీఐలో కిక్కిరిసిన రైతులు

అయిజ: పట్టణంలోని ఎస్‌బీఐలో మంగళవారం ఖాతాదారులు కిక్కిరిసి పోయారు. ప్రభుత్వం రైతులకు పంట రుణమాఫీ చేసినట్లు ప్రకటన వెలువడినప్పటి నుంచి వివిధ బ్యాంకుల్లో రైతులు కిక్కిరిసి పోతున్నారు. తమ ఖాతాలకు సంబంధించి రుణమాఫి వచ్చిందో లేదో తెలుసుకునేందుకు ప్రతి రోజు వందల సంఖ్యలో ఒకేసారి బ్యాంక్‌లకు వస్తున్నారు. దీంతో వారి ఖాతాలను పరిశీలించేందుకు అధికారులు తలలు పట్టుకుంటున్నారు. 40 రోజుల క్రితం రుణమాఫీ అయినట్లు రైతుల సెల్ ఫోన్‌లకు మెసేజ్ వచ్చినా ఇప్పటి వరకు ఖాతాల్లో జమకాలేదని రైతులు వాపోతున్నారు.

ప్రయాణికుల కోసం బెంచీల ఏర్పాటు



మిట్టదొడ్డి స్టేజీ దగ్గర ఏర్పాటు చేసిన బెంచీ

గట్టు: ప్రయాణికుల సౌకర్యార్థం బుధవారం దాతలు బెంచీలను ఏర్పాటు చేశారు. కర్నూలు–రాయచూర్ అంతర్రాష్ట్ర రహదారిపై ఉన్న మిట్టదొడ్డి స్టేజీ, తుమ్మలపల్లి స్టేజీ, సంకాపురం స్టేజీల దగ్గర బెంచీలు పెట్టారు. చాగదోనకు చెందిన ఈడిగ సరస్వతి వర్ధంతి సందర్భంగా జ్ఞాపకార్థం గౌడ సంఘం నాయకుడు మునిచందర్‌గౌడు, అతని కుమారుడు కార్తీక్‌గౌడులు వాటిని ఏర్పాటు చేశారు. బస్సుల కోసం ఆయా గ్రామాల స్టేజీల దగ్గర ఎదురు చూసే ప్రయాణికులకు ఈ బెంచీలు ఎంతగానో ఉపయోగ పడనున్నాయి. బెంచీలను ఏర్పాటు చేసిన దాతలను ప్రయాణికులు అభినందించారు.

పోలీసుల అదుపులో మైనర్లు

గద్వాల క్రైం: పోలీసుల అదుపులో పలువురు మైనర్లు ఉన్నారు. రెండు రోజుల క్రితం న్యూ హౌసింగ్ బోర్డు రెండో రైల్వే గేట్ కాలనీలో నూతన గృహ సముదాయంలో కాపర్ వైర్‌ను అపహరించినట్లు ఇంటి యజమానులు గుర్తించారు. మంగళవారం ఉదయం అదే కాలనీలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. గతంలో ఇదే తరహాలో విద్యుత్ కాపర్ వైర్‌ను చోరీ పట్టణ పోలీసులకు తెలిపారు.